325129001

పొగకు మూలము నిప్పుల పుంజముండ
రైలు బండిని నడిపించు డ్రైవరుండ
ఆటోమేటికు లైటుకు అవధులుండ
ఒకడు ప్రకృతిని సృష్టింప నుండవలదె.

ప్రేమ స్వరూపులారా!

ఈ చిత్ర విచిత్రమైన చరాచర ప్రపంచమునకు సృష్టికర్త ఒకడున్నాడు. అతను సర్వజ్ఞుడు సర్వశక్తి మయుడు. సర్వవ్యాపకుడు. అట్టి భగవంతుని అనేకమంది అనేక పేర్లతో స్మరిస్తూ భజిస్తూ తరిస్తూ వచ్చారు.

అల్లాయంచు మహమ్మదీయులు జెహోవాయంచు సత్క్రైస్తవుల్
ఫుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లరును నాయుర్భోగ భాగ్యాది సం
పల్లాభంబుల నొసంగి బ్రోచు పరమాత్ముండొకండే యంచు భావించుడీ.

ఏకమత్యము, సంఘ భావము, భక్తి ప్రపత్తులు ప్రతి మానవునికి అత్యవసరము. ఇట్టి పవిత్రమైన మూడు సూత్రములు మానవ లోకములో అభివృద్ధి పొందింప దలచి అనేకమంది మహనీయులు కొన్ని మతములు స్థాపిస్తూ వచ్చారు. మతమనగా కేవలము ఒక పరిమితమైనది కాదు. మానవాభ్యుదయమునకు జీవిత పరమావధికి మార్గము చూపించేదే మతము. మానవునియందలి మానవత్వము ప్రేరేపించి పదిమందితో కలసి ఆనందముగా జీవితము గడిపింప జేసేదే మతము. జీవునకు దేవునకు మధ్యనున్న సంబంధ బాంధవ్యమును చేకూర్చునదే మతము. అనేకత్వమందలి ఏకత్వమును నిరూపించేదే మతము ప్రేమ, త్యాగము, సేవ, ధర్మము యీ మతమునకు ప్రధానమైన అంగములు. మానవునియందలి దివ్యభావములను, సత్య భావములను వ్యాపింప జేసి సమాజమునకు అందింప జేసేదే మతము. మానవ జీవితములో ఔన్నత్యమును ఆనందమును, సమతను నిరూపింప జేసి జగత్తునకు ఏకత్వము బోధించేదే మతము.

ఇటువంటి దివ్యమైన మతమును యీనాడు సంకుచితమైన భావముతో అనుభవిస్తూ ఆచరిస్తూ ప్రచారప్రబోధలు సల్పుటము దురదృష్టము. ఇది యావత్ మానవ జాతికే అంతర్భాగమైన ప్రవాహము యీ మతము. ఇట్టి పవిత్రమైన మతరహస్యమును సమాజమునందు వ్యాపింప చేసే నిమిత్తమై మతకర్త

325R9002

లు కొన్ని విధములైన నిబంధనలు సల్పి జగత్తులో ప్రచారప్రబోధలు సలుపుతూ వచ్చారు. అహింసాత్వాన్ని, పవిత్రతను, దివ్యత్వమును ప్రచురింప జేయుటకు సత్యఅహింసలే ప్రధానమైన సూత్రములని బౌద్ధమతము ప్రచారము చేస్తూ వచ్చింది. మానవులందరు భగవంతుని బిడ్డలే. ప్రతి ఒక్కరు కూడను సోదర సోదరీ భావము పెంచుకొని దివ్యమైన దైవత్వమును ప్రార్థించి ఆనందమును అనుభవించాలని క్రిష్టియన్ మతము ప్రచారము చేస్తూ వచ్చింది. All one one be alike to every one. అని ప్రబోధలు సల్పినాడు జీసస్. ఇక మహమ్మదీయ మతమునందు ఆత్మీరీతిగా అందరు కూడను సోదరులే. ఈ సోదర భావమును అభివృద్ధిపరచుకొని జగత్తునకు శాంతి భద్రతలు చేకూర్చటానికి ప్రార్థనే ప్రధాన మార్గమని వారు ప్రబోధించారు.

'త్యజే దేహ కుల స్వార్థే కులం జనపద స్వార్థే' అన్నాడు మను చక్రవర్తి. నాయనా మానవుడై జన్మించినందుకు ఈ జగత్తులో కులమునకై నీ జీవితాన్ని పోషించుకో. సమాజమునకై త్యాగము చేయి కులమును త్యాగము చేయి. సమాజమే ప్రధానమైన సూత్రమని ప్రబోధించినది మనుశాస్త్రము. ఉపనిషత్తులు సహస్రాక్ష సహస్రపాత్ అన్ని శిరస్సులు కూడను దైవము యొక్క శిరస్సులే. అన్ని పాదములు దైవము యొక్క పాదములే. అన్ని హస్తములు దైవము యొక్క హస్తములే. ఈ ఏకత్వము యొక్క సమాజతత్వాన్ని ఉపనిషత్తులు కూడను బోధిస్తున్నాయి. మానవునిది సమిష్టి సాంప్రదాయమేగాని వ్యష్టి సాంప్రదాయము కాదు. వ్యష్టిగా ఈ జగత్తునందు మానవుడు జీవించలేడు. మానవుడు ఈ జగత్తులో సుఖశాంతులతో జీవించవలెనన్న సమిష్టి భావాన్ని పోషించుకోవాలి. 'సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై' అనగా అందరూ కలిసిమెలిసి జీవిస్తాం. కలిసి మెలిసి పోరాడుదాం. కలిసి మెలిసి ఆనందముతో పెరుగుదాం. అని కూడను వేదము ప్రబోధించింది. ఏతావాతా అన్ని మతములు కూడను సమాజము యొక్క క్షేమాన్ని, శ్రేయస్సును దృష్టియందు వుంచుకొని ప్రబోధలు సలుపుతూ వచ్చాయి. ఈ సమాజము యొక్క క్షేమమే జగత్ క్షేమము. సత్యసాక్షాత్కారమనే అమృత బిందువు సమాజమునందే ఆవిర్భవించినది. కానీ దురదృష్టవశాత్తు ఇదే సమాజమునందు ఈనాడు కల్లోలములు, కలహములు, కార్పణ్యములు కలిగి కలుషితమై విషముగా మారింది. అన్ని మతములు కూడను పవిత్రతనే బోధిస్తూ వచ్చాయి. అన్ని మతములు సత్యమార్గమును అవలంబించమని బోధిస్తూ వచ్చాయి. సద్గుణములు మానవునికి ప్రధానము ప్రమాణము అని బోధిస్తూ వచ్చాయి. కనుక అన్ని మతముల యొక్క సారము, అన్ని శాస్త్రముల యొక్క మూలము, అన్ని ప్రయత్నముల యొక్క గమ్యము ఒక్కటై వుండగా ఈ విధమైన భేద భావములకు అవకాశము ఎక్కడ వున్నది? మార్గములు వేరు వేరుగాని గమ్యము ఒక్కటే. ఇంత మాత్రము చేత మానవులు మతమను విషయమై కలహించి అనేక విధములైన కల్లోలములు రెచ్చగొట్టుటము దుర్లక్షణమే. కుంభవర్షము కురియునప్పుడు జలమంతా పవిత్రముగానే వుంటుంది. ఈ జలము కొండలపైన గుట్టలపైన నేలపైన సముద్రముపైన నదులపైన పడుతుంది.

ఆ ప్రదేశముల యొక్క పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని రూపనామములు మారుతూ వుంటాయి. అంత మాత్రము చేత జలబోధమున్నదని భావించరాదు. మతస్థాపకులయొక్క ప్రభావములు పురస్కరించుకొని, అట్టి దేశకాలపరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని ప్రజలయొక్క అభిరుచులను కూడను పురస్కరించుకొని కొన్ని నియమనిబంధనలు చేస్తూ వచ్చారు.

అంత మాత్రము చేత ఒకరు అధికులనిగాని యింకొకరు అల్పులనిగాని మనము బేధమును పాటించరాదు. ఏమాత్రము బేధము లేనిది మతము యొక్క స్వభావము. ఇలాంటి పవిత్రమైన మత సాంప్రదాయములను సమిష్టి రూపములో అనుభవించి దివ్యమైన దైవత్వమును ప్రచారప్రబోధలు సల్పుటయే మానవుని యొక్క ప్రధాన కర్తవ్యము. సత్యము ప్రధాన సూత్రము. అన్ని మతములందు ఆడిన మాట తప్పకూడదని యిచ్చిన వాగ్దానము చెల్లించవలెనని మాట యే మానవునకు ప్రధానమని, మాటను కాపాడుకోటమే నిజమైన ఆస్తియని అన్ని ధర్మముల యొక్క కర్తయైన మను చక్రవర్తి బోధిస్తూ వచ్చారు. సోక్రటీస్ కు ప్రధాన శిష్యుడు ప్లేటో. ఈ ప్లేటో శిష్యుడు అరిస్టాటిల్. అరిస్టాటిల్ శిష్యుడు అలగ్జాండరు. ఇతే ప్లేటో ప్రభుత్వ తత్వాన్ని న్యాయరీతిగా ధర్మరీతిగా సహనరీతిగా సమత్వముతో అభివృద్ధి పోషించాలని ప్రచారము చేసాడు. Truth, beauty, goodness అనే మూడింటిని ప్రధానమైన లక్ష్యములో ప్రచారము చేస్తూ వచ్చారు. దీనినే వేదములన్నీ కూడను సత్యం శివం సుందరం అన్నాయి. పదముల యొక్క ప్రభావములు అర్థములు అనేకత్వముగా భావించినప్పటికి యదార్థమైన తత్వము ఒకటియే. ఇలాంటి ఏకత్వమును మానవత్వముగా విశ్వసించి దివ్యత్వములో మనము ఆనందమును అనుభవింప చేసుకోటమే ప్రధానమైన సాధన. భారతీయుల యొక్క సాంప్రదాయము, భారతీయుల యొక్క సంస్కృతి దివ్యమైన దైవత్వమునే విశ్వసిస్తూ వచ్చింది. 'పండితో' అనే పదమునకు ఎంత పవిత్రమైన అర్థమును ప్రబోధించిందో విచారించవచ్చు. దైవస్వరూపము కానిది యీ జగత్తులో ఒకటి కూడను లేదని సూచించినది. రాయి మొదలు రత్నము వరకు పచ్చిక మొదలు పారిజాతము వరకు చీమ మొదలు ఏనుగ వరకు పక్షి మొదలు సర్పవరకు చెట్టు మొదలు చీమల వరకు కూడను ఏకత్వము ప్రబోధించినది. దివ్యత్వమును విశ్వసించినది. దైవత్వముగా ఆరాధించినది.

ప్రేమ అనే దైవసంపత్తి కేవలము మానవులయందు మాత్రమే పరిమితము కాకూడదని సర్వ జీవులకు యీ ప్రేమ తత్వాన్ని పెంచాలని పంచాలని కూడను ప్రబోధించింది భారతీయ సంస్కృతి. కాని యీ సత్యాన్ని గుర్తించలేని మూర్ఖులు, అజ్ఞానులు భారతీయులు రాళ్ళను రప్పలను చెట్లను పూజిస్తున్నారు పాములను పూజిస్తున్నారు అని హాస్యాస్పదము చేయటము కేవలము అర్థరహితమైనది. భారతీయుల దృష్టియందు సర్వపదార్థములు దైవస్వరూపములే. 'సర్వం ఖల్విదం బ్రహ్మ, సర్వం విష్ణుమయం జగత్' అనే

పదముల యొక్క అంతరార్థము ఈ సత్యాన్నే ప్రబోధిస్తూ వచ్చింది. ఇంత పవిత్రమైన విశాలమైన ఆత్మతత్వమును ప్రబోధించినది మరొక్క దేశము కానరాదు. ఇదియే గొప్ప [illegible] అని. ఇలాంటి పవిత్రమైన మార్గము మరే దేశమందు కానరాదు. అన్ని మతములందు యీ విధమైన సమత్వమును బోధించినప్పటికిని స్వార్థపరులు స్వప్రయోజనాల యీ విశాల తత్వమును గుర్తించుకోలేక కేవలము సంకుచితమైన భావములతో కలహములను పూనుకుంటున్నారు. శాస్త్ర జ్ఞానము కలవాడు పండితుడు కాదు. వేద శాస్త్ర ఇతిహాస పురాణ ప్రమాణములు గుర్తించిన వాడు పండితుడు కాదు. పాండిత్యము ఆర్జించిన వాడు పండితుడు కాదు. భాషా ప్రవీణుడైన వాడు పండితుడు కాదు. 'పండితాః సమదర్శినః' సమానమైన దృష్టి కలవాడే నిజమైన పండితుడు. అన్ని మతములందు సమదృష్టిని మనము పెంచుకోవాలి. ఏ మతమును మనము విమర్శించరాదు. దూషించరాదు. అన్ని మతములందు వుండిన ఆనంద రసమును గ్రోలాలి. కనుకనే సర్వమతముల సారము ఏకత్వము అదియే ప్రేమ తత్వము. ఆ ప్రేమ తత్వాన్ని మనం పెంచుకున్నప్పుడు ద్వేషమునకు అవకాశమే లేదు. ఈనాడు జగత్తులో జరిగే కలహములు, కల్లోలములు, కార్పణ్యములకు మతమే కారణమని భావిస్తున్నారు. మతములు కాదు కారణము. స్వార్థపరమైన మతులే దీనికి కారణము.

ఏక మతములో వుండి కూడను భిన్నాభిప్రాయములచే ద్వేషించినటువంటివి లోకములో ఎన్ని లేవు. ఇప్పుడు ఇరాన్, ఇరాక్ ఒకే మతము వారు. కాని ఎందుకు కలహిస్తున్నారు. విదేశీయులలో మూడు భాగములు క్రైస్తవులు వుంటున్నారు. వారిలో వారు ఎందుకు కలహిస్తున్నారు. భారతదేశములో అందరు భారతీయులుగానే వుంటున్నారు. భారతీయ మతంగానే వుంటున్నది. కాని ఎందుకు కలహిస్తున్నారు. కనుక ఏతావాతా మనము లోతుగా దిగి విచారించినప్పుడు యీ కలహమునకు మతములు కాదు కారణము. స్వార్థపరమైన మతులే దీనికి కారణము. మతమనే బురఖాను ధరించి వ్యక్తిగతమైన స్వార్థమును సాధించటానికి యీ విధమైన కల్లోలములు లేకెత్తిస్తున్నారు.

ప్రేమస్వరూపులారా! ప్రపంచములో ప్రధానమైన శాంతిని మనము పొందాలనుకున్నప్పుడు మతములను యేమాత్రము ద్వేషించరాదు. మన జాతి కంటె నీతి ప్రధానముగా చూడాలి. మతము కంటె మమత అభివృద్ధిని మనము పోషించాలి. కనుక మమత సమత క్షమత ప్రతి మానవునికి అత్యవసరము. పేరు ప్రతిష్టల నిమిత్తమై ఆ మత కర్తల యొక్క నియమములను వుల్లంఘించి దానికి విరుద్ధమైన మార్గాలు అవలంబిస్తూ వచ్చారు. కాలము కదలిన కొలది మతములందు వున్న మనుజుల ప్రభావములు మార్పు కలుగుతూ అనేక విధములైన తెగలను స్థాపిస్తూ వచ్చారు. ఇది వ్యక్తిగతమైన స్వార్థమార్గమే తప్ప మతకర్త ప్రబోధలు కావు. మనము స్వార్థము, స్వప్రయోజనమును త్యాగము చెయ్యాలి. ప్రేమ సహన సానుభూతులను పెంచుకోవాలి. సమ జీవితమును మనము సాధించాలి. అప్పుడే దేశము యొక్క శాంతి, విశ్వము యొక్క

క్షేమము మనము ఆశించిన వారముగాని లేక సేవించిన వారముగాని కాగలము. సేవ అత్యవసరము. యీ సేవ యందు ఎట్టి భేద భావము అందించరాదు. సమాజము యొక్క అభివృద్ధినే మనము ఆశించాలనుకున్నప్పుడు మన కర్తవ్యమును మన మమత్వాన్ని త్యాగము చేయాలి. అట్టి త్యాగమే జీవితానికి సరియైన మార్గము కనుకనే వేదము కూడను 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశు' అని త్యాగము చేతనే మనకు అమృతత్వము ప్రాప్తిస్తుంది గాని మనము స్వార్థము చేత అమృతత్వాన్ని పొందలేము. ఈ సమత్వమును జగతికి వ్యాపింపజేయటానికి సాయీ సైన్యము పూనుకోవాలి.

ఈనాడు ప్రశాంతి నిలయములో ఎన్నిమతములవారో కూడినారు. ఎన్ని భాషలవారో కూడినారు. ఎన్ని సాంప్రదాయములవారో చేరినారు. కాని అందరియొక్క సాంప్రదాయము, అందరియొక్క లక్ష్యము, అందరియొక్క ఆశయము యీ ప్రశాంతి నిలయములో ఒక్కటే. అదే ప్రేమ తత్త్వము. ఈ క్రిస్మస్ అనే పండుగను అనేక దేశములవారు అనేక విధములైన రూపములతో అనేకరకములైన ఆనంద ఆహ్లాదములతో, ఆర్భాటములతో జరుపుకుంటూ వుంటారు. కాని ఒకటి మాత్రం అందరు గుర్తించాలి. ఒక్క ప్రశాంతి నిలయములో జరిగే క్రిస్మస్ పండుగ ప్రపంచములో ఎక్కడా జరుగదు. ఇన్ని మతముల వారు, ఇన్ని భాషలవారు ఇన్ని సాంప్రదాయముల వారు ఒక దగ్గర చేరి దివ్యమైన భావముతో దైవచింతనలో పవిత్రమైన కర్మల చేత సార్థకము గావించుకొనేది ఎక్కడ కూడను జరగదు. ఇదే సాంప్రదాయమును మనము ప్రపంచమునకంతా చాటాలి. జరుపుకుంటారు అమెరికాలో, జర్మనీలో, జపానులో, ఇటలీలో. అన్నిటైపులా జరుపుకుంటారు గాని ఏమి జరుపుకుంటారు యీ క్రిస్మస్ పండుగ అనుకుంటే డిన్నర్లు చేసుకోవటము బాగా త్రాగటము, డాన్సులు ఆడటము, కాలమును వ్యర్థము చేయటము. ఇక్కడ కూడను మీరు త్రాగుతున్నారు. ఏమి త్రాగుతున్నారు? పవిత్రమైన ప్రేమ త్రాగుతున్నారు. ఈ ప్రేమను ప్రపంచమునకే మీరు వ్యాపించాలి. ఏ విధమైన మతభేదములను మీరు పాటించకూడదు. ప్రబోధించిన వాక్యములను ప్రచార ప్రబోధలలో మనము ఆనందమును అనుభవించాలి. కేవలము బోధించినంత మాత్రమున చాలదు. మీరు అనుభవించి ఆనందించి పదిమందికి అందించాలి. ప్రతి మానవునకు భక్తి ప్రపత్తులు అత్యవసరము. భక్తి లేక జీవితమే వ్యర్థము. సృష్టికర్తకు తగిన కృతజ్ఞత చెప్పలేని మానవుని జీవితము వ్యర్థము కాదా!

ఇన్ని సౌకర్యములు ఇంత సదుపాయములు ఇన్నిరకములైన పంచభూతములు మానవుని యొక్క పోషణా నిమిత్తమై అందించిన భగవంతునకు కించిత్తైనా కృతజ్ఞత చెప్పుకోకూడదా. మానవునకు కృతజ్ఞతయే ప్రధానమైన ప్రాణము. దైవమునకు ప్రతి మానవుడు కృతజ్ఞత చూపించాలి. మతకర్తలైన పెద్దలు కూడను ఇలాంటి సత్యమార్గమును అనుభవించి అనేక ఆదర్శాలను బోధిస్తూ వచ్చారు. మతకర్తలు బోధించి

న సత్యసూక్తులను హృదయములో హత్తుకున్నట్లుగా మీరు ఆచరించాలి. కేవలము బైబిలు చదివినంత మాత్రమున సార్థకము గాదు. ఖురాను చదివినంత మాత్రమున సార్థకము గాదు. భగవద్గీతను పఠించినంత మాత్రమున సార్థకము కాదు. గ్రంథరాజములోని పలుకులను ఉచ్ఛరించినంత మాత్రమున సార్థకము కాదు. అందులో వుండిన ప్రధాన సూత్రాన్ని మనము ఆచరణలో పెట్టాలి. సోక్రటీసు అనేకమంది యువకులనందరి చేర్చి నిత్యానిత్య విషయ పరిశీలన జరిపే విధానమును ప్రబోధించేవాడు. రాజ్యపాలనకు ప్రధాన అధికారి భక్తిప్రపత్తులు కలిగినవాడై వుండాలి. భక్తిప్రపత్తులు లేనివాడు రాజ్యాధికారి కావటానికి పనికాడు అన్నాడు. సత్యమునే తన జీవితాదర్శముగా భావించాలి. భగవంతునికి కృతజ్ఞతను చూపించే వ్యక్తిగా వుండాలి. రాజ్యాధికారాన్ని అనుభవించేటప్పుడు అహంకారముతో దైవాన్ని మరువకూడదని, అట్టి అధికారి అధఃపతనమవుతాడని బోధించాడు. కానీ ఈ ప్రబోధలు రాజులైన వారికి యేమాత్రము నచ్చలేదు. తద్వారా అతనిపైన అనేక రకములైన నిందలు మోపుతూ అతనిని శత్రువునిగా భావిస్తూ వచ్చారు. కట్టకడపటికి అతనిని చంపటానికి నిర్ణయము చేశారు. తాను నిర్మల హృదయుడు. నిస్వార్థ కర్మజీవి. అలాంటివి బోధించటానికి యేమాత్రం భయపడలేదు. ఈ అపవిత్రమైన పాలకుల చేతిలో నా ప్రాణము విడిచే దానికంటె నా పవిత్రమైన శిష్యుల చేతిలో ప్రాణము వదలటము చాలా మంచిదని భావించాడు. ఒక సత్యాన్ని తన శిష్యులకు అంత్యములో ప్రబోధించాడు. నాయనా మీరందరు కూడను దైవమునకు కృతజ్ఞత చూపాలి. సత్యాన్ని పాటించాలి. ఆడిన మాట తప్పి యితరుల యొక్క ఋణములో మన జీవితము వదలకూడదు. అను ఆదర్శమును తాను నిరూపించాడు. అతను ఎప్పుడో ఒక వ్యక్తికి ఒక కోడిని యిస్తానని వాగ్దానము చేశాడు. తన ప్రాణమును తీసుకోటానికి ముందు యోచన చేశాడు. నేను ఎవరికి ఏ ప్రామిస్ చేశాను అని యోచించి ఒక శిష్యుని దగ్గరకు పిలిచాడు. నాయనా! నేను ఒక వ్యక్తికి ఫలానా అప్పుడు ఒక వాగ్దానము చేశాను. కనుక నా ప్రాణము వుండినప్పుడే నీవు ఒక కోడిని తెచ్చి ఆ వ్యక్తికి అందించమని చెప్పాడు. లేకుండిన అతని యొక్క ఋణములో నేను పుట్టవలసి వస్తుంది. ఆ యొక్క సూక్తి శిష్యులలో పెద్ద వ్యాప్తి అయిపోయింది. పునర్జన్మమునకు కారణం మనయొక్క మాటలు తప్పటమే. కృతజ్ఞత యివ్వకుండా చూచుకోటమే మన పునర్జన్మకు మూలకారణము. కనుక మాట ఒక విత్తనము వంటిది. అది ఏనాటికైనా తిరిగి 'పునరపి జననం పునరపి మరణం కనుక నీవు యిచ్చిన మాటను దక్కించుకొని దాని సార్థకము చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

ఇదే విధముగానే 'హజరత్ మహమ్మద్' ఒక ఆదర్శమును నిరూపించాడు. అతను కూడా ప్రాణము విడుచుటకు పూర్వము చక్కగా యోచించి నేను ఎవరికైనా ఒక వాగ్దానము చేశానా? నేను ఎవరికైనా ఋణపడినానా? ఋణముంటే తిరిగి నాకు పునర్జన్మము కలుగుతుంది. ఋణవిముక్తుడను కావాలనే సత్యమును తన శిష్యులకు ప్రబోధిస్తూ వచ్చాడు. అతను ఎప్పుడో ఒంటెపైన ప్రయాణము

చేసినప్పుడు తాను శిష్యుని మాటలలో మునిగి ఒంటె వానికి సుంకము ఇవ్వకుండా వచ్చాడు. అది జ్ఞాపకము వచ్చింది మరణించటానికి పూర్వము. తన యొక్క శిష్యుని దగ్గరకు పిల్చి నాయనా ఫలానా స్థానము లోపల ఒంటె గలవానికి నేను ఆనాడు ఛార్జీ ఇవ్వకుండా వచ్చాను. కనుక అతనికి యీ ధనమును యిచ్చి యీ ఋణమును విముక్తి చేయమన్నాడు.

ఇదే ప్రతి భారతీయ శాస్త్రమునందు కూడను ఋణవిముక్తి అనే సత్యాన్ని అధికంగా ప్రబోధిస్తూ వచ్చింది. ఆడిన మాట తప్పకూడదని చెప్పి తన రాజ్యమునకు, తన భార్యను తన బిడ్డలను కూడా కోల్పోయి సత్యాన్ని నిలబెట్టటానికి తగిన కృషి చేసి ప్రాణములను కూడను అర్పితం చేశారు హరిశ్చంద్రుడు. ఈ విధంగా లోతునకు దిగి విచారణ చేస్తే అన్ని మతములందు యీ సత్యము యొక్క ప్రభావము త్యాగము యొక్క ప్రభావము, ఐకమత్యము యొక్క ప్రభావము ఎంతైనా మనము గుర్తించటానికి వీలౌతుంది. కనుక ఐకమత్యము అవసరము. ఐకమత్యమే లేకుండిన జీవితమే వ్యర్థమైపోతుంది. మనము దేశద్రోహులుగా కాదు దైవద్రోహులుగా మారగలము. వ్యష్టిగా జీవించటానికి బదులు నీవు సమిష్టిగా జీవించటానికి ప్రయత్నించు. పదిమందితో చేరి మనము జీవించటానికి పూనుకోవాలి. పదిమందిలో ప్రేమను మనము పెంచుకోవాలి. ఈ ప్రేమలో పాటు సన్నిహిత సంబంధ బాంధవ్యమును అభివృద్ధిగావించుకోవాలి. అదే క్రిస్టియన్ మతమునందు ప్రధానమైన సూత్రము. అన్ని మతములందు యీ ఐకమత్యమును అభివృద్ధిగావించుకోటానికి తగిన కృషి చేశారు.

ఏ వ్యక్తి వ్యష్టిగా భగవంతుని ప్రార్థన చేస్తున్నాడో ఆ ప్రార్థనకంటె సమిష్టి ప్రార్థన అత్యవసరమని గురునానక్ సమిష్టి భజనలు ప్రారంభించాడు. అందరు చేరి ఏకకంఠముతో భగవంతుని ప్రార్థించినప్పుడు ఆ భగవంతుని హృదయము కరిగి కదలి వస్తుంది. ఇంతమంది హృదయాల్లో పల యే హృదయమైనా ఒకటి పవిత్రమైనది వుంటుంది కదా! కనుక ఆ హృదయమైనా భగవంతుని హృదయాన్ని కరిగిస్తుంది. కనుక సమిష్టి భజనల లోపల మనము పాల్గొనాలి. సమిష్టిసేవలో మనం పాల్గొనాలి. సమిష్టి జీవితమును మనం గడపాలి. అదే సర్వోత్కృష్టమైన మార్గము. ద్వేష భావాలు నిర్మూలనము చేసి ప్రేమ భావమును పెంచుకోవాలి.

ప్రేమయే ప్రధానమైన భగవంతుని యొక్క రూపము. కనుక ప్రేమస్వరూపమైన భగవంతుని ప్రేమ చేతనే పొందాలి. అందువలనే భగవంతునికి గల సహస్రనామముల లోపల ఒక నామము చాలా ప్రధానమైనదన్నారు. అదే సర్వోత్కృష్టమైనది. 'సచ్చిదానంద స్వరూపుడు' అన్నారు. సత్ అనగా సత్యము. చిత్ అనగా పవిత్రమైన జ్ఞానము. ఈ సత్యము, జ్ఞానము ఎక్కడ వుంటుందో అక్కడ ఆనందము పుట్టుకొస్తుంది. సత్యస్వరూపమైన భగవంతుని సత్యస్వరూపముతోనే పొందాలి. పరిపూర్ణ జ్ఞానమైన భగ

వంతుని జ్ఞానము తోనే పొందాలి. ఆనందమయుడైన భగవంతుని ఆనందము తోనే పొందాలి. కనుకనే భగవంతుని పొందాలనుకుంటే మనము సత్యమార్గము నవలంబించాలి. ప్రేమ మార్గములో ప్రయాణము చెయ్యాలి. ఐకమత్యము తో మనము అంత్యము కావాలి. ఈ భేదాన్ని దూరము చేసుకోవాలి. ఇదే ఈనాటి ప్రధానమైన సందేశము.

ప్రేమ స్వరూపులారా! ఎక్కడ గాని, ఏదేశమందు గాని ఈ మత భేదములకు యేమాత్రము అవకాశము ఇవ్వకూడదు. మతములు నిర్మూలించమని నేను బోధించటం లేదు. మత ద్వేషాన్ని నిర్మూలం చేయాలి. మీ మీ మతములను మీరు పాటించండి. మీ మీ మత సాంప్రదాయములను మీరు అనుసరించండి. ఒక మతమునకు మరొక మతమునకు మధ్యనున్న ద్వేషము నిర్మూలం చేయండి. ద్వేషము లేనప్పుడు ప్రేమ మనలో అభివృద్ధి అవుతుంది. ఎప్పుడు ప్రేమ మనలో అభివృద్ధి అయిందో పరమాత్ముడు మనకు ప్రత్యక్షమౌతాడు. బాధ లేకుండా భగవంతుని ప్రత్యక్షం చేసుకోవాలి, సాక్షాత్కారం కావాలి, అబరేషన్ కావాలి నోటితో కోరినంత మాత్రమున ప్రయోజనం లేదు. ప్రేమ. ప్రేమ నాయందు నీయందు వుండినటువంటిది ఒకే ప్రేమ. ఒకే భగవంతుడు అనే సత్యాన్ని గుర్తించాలి. మీరందరు ఇక్కడ చేరటానికి అదొక్కటే మూలకారణము. ఆ ప్రేమ అనే దారము అందరిని బంధించి వేస్తుంది. అందరిని ఏకం గావిస్తుంది. అందరిని లయం చేస్తుంది. అందరిని ఆడిస్తుంది. ఆనందములో చేరుస్తుంది. కనుక ప్రేమ తత్వాన్ని ప్రతి మానవుడు అభివృద్ధి పరచుకోవాలి.

1990 డిసెంబరు 25వ తేదీ, మంగళవారం, పూర్ణచంద్రలో భగవాన్ బాబావారి దివ్యోపదేశం